క్లుప్తంగా

వైభవంగా రామాలయం బ్రహ్మోత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

ముత్తారం: మండలంలోని లక్కారం శ్రీకోదండ రామాలయం ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. అర్చకుడు శ్రీనివాసచారి ఆధ్వర్యంలో హోమం , పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి, లలిత, గ్రామపెద్దలు సారయ్య, రాజేశం, రాజయ్య, రమేశ్, శ్రీనివాస్, రాజగట్టయ్య, మల్లేశం, రాజాబాబు, లింగయ్య, రాజిరెడ్డి, రాకేశ్, వేణు, సంతోష్ పాల్గొన్నారు.

ఆశావర్కర్ల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ఆశావర్కర్లు

ధర్మారం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా రాష్ట్ర రహదారిపై మంగళవారం ఆశావర్కర్లు రాస్తారోకో నిర్వహించారు. ఆశావర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు రూప మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల సాధనకు ఉద్యమిస్తున్న తమను రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో అరెస్టు చేయించడం సరికాదన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమకు రూ.18వేల జీతం ఇస్తామని ప్రకటించిందని గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే హామీలను విస్మరించటం సరికాదన్నారు. ఆశావర్కర్ల సంఘం మాజీ అధ్యక్షురాలు సామంతుల స్వప్న, మాజీ ప్రధాన కార్యదర్శి శోభ, మండలంలోని ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఇటీవల కురిసిన వడగండ్ల వానతో నష్టపోయిన పంటలను గుర్తించి రైతులకు సత్వరమే పరిహారం చెల్లించాలని బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రమేశ్, పట్టణ అధ్యక్షుడు రాకేశ్ కోరారు. కలెక్టరేట్‌లో ఏవో శ్రీనివాస్‌కు మంగళవారం వారు వినతిపత్రం అందించారు. వరి, మొక్కజొన్న పంటలు వర్షానికి దెబ్బతిని రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయన్నారు. రాళ్ల వర్షం పడడంతో వరిపంట నేలపాలైందని వాపోయారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి రైతులకు పరిహారం అందించాలన్నారు. పంటసాగుకు అవసరమైన సాగునీటిని ఎస్సారెస్పీ కాలువల ద్వారా అందించి ఆదుకోవాలని కోరారు. నాయకులు కారెంగుల శ్రీనివాస్, కావేటి రాజగోపాల్, తంగెడ రాజేశ్వర్‌రావు, వొల్లె తిరుపతి, ఎర్రోళ్ల శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, సబ్బు మల్లయ్య, సతీశ్, అంజి, మధు, శివయ్య ఉన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శికి స్వాగతం



నివాళి అర్పిస్తున్న నాయకులు

జ్యోతినగర్: భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీకి సీపీఎం ఎన్టీపీసీ, రామగుండం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్ వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎఫ్‌సీఐ కార్నర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు బిక్షమయ్య, బిక్షపతి, రామాచారి, భూపాల్, నాంసాని శంకర్, ముత్యంరావు, వై.యాకయ్య, తుమ్మల రాజారెడ్డి, మహేశ్వరి, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ధర్మారం: మండలంలోని బొమ్మారెడ్డిపల్లి గ్రామంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. కరీంనగర్‌కు చెందిన సన్‌రైస్ ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో దాదాపు 500 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రవీందర్‌శెట్టి, క్యాంప్ కమిటీ చైర్మన్ మునీందర్‌రెడ్డి, లయన్స్ లెజెండ్ చైర్మన్ రాజేందర్, జిల్లా కోఆర్డినేటర్ ఎల్లారెడ్డి, క్లబ్ సభ్యులు చంద్రయ్య, మాజీ సర్పంచు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



కొలనూర్ రైల్వేస్టేషన్‌లో నిరుపయోగంగా మంచినీటి కుళాయిలు, మరుగుదొడ్లు

రైల్వేస్టేషన్లలో సౌకర్యాలు కరువు

- నిరుపయోగంగా కుళాయిలు, మరుగుదొడ్లు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

ఓదెల: రైల్వేశాఖ రైల్వేస్టేషన్లలో ఆధునీకరణ పనులు చేస్తోంది. కానీ ప్రయాణికులకు మాత్రం కనీస సౌకర్యాలపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నారు. కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్యలో ఓదెల, కొలనూర్, పొత్కపల్లి రైల్వేస్టేషన్లలో మంచినీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రైల్వేస్టేషన్ల నుంచి రామగిరి, భాగ్యనగర్, సింగరేణి, సిర్పూర్‌కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, అజ్నీ, ఇంటర్‌సిటీ రైళ్ల ద్వారా వేలసంఖ్యలో ప్రయాణం చేస్తుంటారు. అయితే రైల్వే స్టేషన్లలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో రైళ్లు వచ్చేదాకా పిల్లలు, వృద్ధులు, మహిళలు మంచినీటి సమస్యలతో గంటల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. నిర్వహణ సరిగా లేక మంచినీటి కుళాయిలు, మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. రైల్వేస్టేషన్లలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని పలుసార్లు జీఎం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ప్రయాణికులు వాపోతున్నారు. కోట్ల రూపాయలతో ఆధునీకరణ పనులు చేపట్టిన రైల్వేశాఖ కనీస సౌకర్యాల ఏర్పాటుపై దృష్టిసారించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ వేడుకలు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ పీఎంశ్రీ తెలంగాణ మోడల్ స్కూల్‌లో మంగళవారం ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరియాణా సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ వంటకాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ ఎండి.షాదుల్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వరూప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎం కార్యదర్శికి వినతి



వినతిపత్రం ఇస్తున్న ఐలు నాయకులు

గోదావరిఖనిటౌన్: న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని కోరుతూ గోదావరిఖని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖనికి వచ్చిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐలు నాయకులు మాట్లాడుతూ కొంతకాలంగా న్యాయవాదులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని వాపోయారు. మంథనిలో మూడేళ్ల క్రితం రోడ్డుపై న్యాయవాద దంపతులు వామనరావు, నాగమణి హత్య జరిగిందని, ఇప్పుడు ఇజ్రాయిల్ అనే న్యాయవాదిని హైదరాబాద్‌లో హత్య చేశారన్నారు. ఇలాంటి దాడులను నిలువరించడానికి సీపీఎం రాష్ట్ర కమిటీ తరఫున డిమాండ్ చేయాలని కోరారు. ఐలు రాష్ట్ర నాయకురాలు చందాల శైలజ, నాయకులు గోసిక ప్రకాశ్, ప్రదీప్, నూతి సురేశ్, పెట్టం వెంకటేశ్వర్లు, అనసంపల్లి రవీందర్, సాన మురళి, ఇరుగురాల మహేందర్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న సంజీవరెడ్డి, నాయకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి (చీకురాయిరోడ్) లోని ఓ ప్రైవేట్ పాఠశాల యజమాన్యం అమర్‌నాథ్ అనే విద్యార్థి హనుమాన్ దీక్షా దుస్తులతో పాఠశాలకు రాగా.. ఆరుబయట ఎండలో నిలబెట్టి స్కూల్‌కు రావొద్దని బెదిరించిన పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థిపై పాఠశాల యజమాన్యం దురుసుగా ప్రవర్తించి మానసికంగా వేధించి దూషించారని ఆయన ఆరోపించారు. విద్యావ్యవస్థలో మత విద్వేషాలను నింపేలా వ్యవహరించడం సరికాదన్నారు. నాయకులు పల్లె సదానందం, కడారి అశోక్‌రావు, అమరగాని ప్రదీప్‌కుమార్, శివంగారి సతీశ్, పర్శ సమ్మయ్య, జంగ చక్రధర్ రెడ్డి, బెజ్జంకి దిలీప్ పాల్గొన్నారు.

ధూంధాం కార్యక్రమం విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సాధన కమిటీ సభ్యులు

ధర్మారం: నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని డిమాండ్ చేస్తూ 26న ఢిల్లీలో చేపట్టిన ధూంధాం విజయవంతం చేయాలని సాధన సమితి ఆధ్వర్యంలో ఢిల్లీ అంబేడ్కర్ స్మారక గృహం వద్ద పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. ధూంధాం కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య, మస్తాన్‌రావు హాజరవుతున్నట్లు సాధన సమితి జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లి స్వామి తెలిపారు. జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరుశరాం, ఉపాధ్యక్షుడు బొల్లి స్వామి, సహాయక కార్యదర్శి పలిగిరి కనకరాజు, నాయకులు బొంకూరి కైలాసం, తాడెం అనిల్, పాలడుగు అంజి పాల్గొన్నారు.

ఈఎస్‌ఐ ఆసుపత్రిలో వైద్యుడిని నియమించండి



వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు

పాలకుర్తి: బసంత్‌నగర్‌లోని ఈఎస్‌ఐ ఆసుపత్రిలో వైద్యుడిని నియమించాలని బసంత్‌నగర్ అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఎన్టీపీసీలోని ఈఎస్‌ఐ ఆసుపత్రి బ్రాంచ్ మేనేజర్ బి.కె.రావుకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. దాదాపు 800 కాంట్రాక్ట్ కార్మికులు ఈఎస్‌ఐ కార్పొరేషన్‌కు డబ్బులు చెల్లిస్తున్నప్పటికీ సంస్థ ద్వారా స్థానికంగా ఎలాంటి సేవలు అందడం లేదన్నారు. నాలుగేళ్లుగా వైద్యుడు లేక కార్మికులు, వారి కుటుంబసభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పదిరోజుల్లోగా ఆసుపత్రికి పర్మినెంట్ వైద్యుడిని నియమించి సేవలు అందించాలని, లేనిపక్షంలో కార్మికసంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, నాయకులు బత్తిని సతీశ్, వేల్పుల సంపత్, ముల్కనూరి శ్రీధర్, పూసల ప్రసాద్, కండె స్వామి, మంత్రి శంకర్, చంద్రమోహన్, సందవేణి రాజయ్య, కాంపెల్లి సుధాకర్ పాల్గొన్నారు.

29న సర్వసభ్య సమావేశం

సుల్తానాబాద్: పట్టణంలోని ఎస్‌వీఆర్ గార్డెన్‌లో 29న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కార్యదర్శి బూర్గు సంతోష్‌కుమార్ తెలిపారు. సమావేశానికి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హాజరు కానున్నారని, రైతులు, సంఘం సభ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

తప్పించుకుని తిరుగుతున్న నేరస్తుడి అరెస్ట్

పెద్దపల్లిరూరల్: రెండేళ్ల క్రితం దొంగతనం కేసుకు సంబంధించిన కేసులో నిందితుడైన చంద్రగిరి రమేశ్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతున్న రమేశ్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయిందని ఎస్సై పేర్కొన్నారు. మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

వేద పండితులకు పంచాంగం బహూకరణ



పంచాంగం బహూకరిస్తున్న తిరుపతి

జ్యోతినగర్: రాబోయే తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం పురస్కరించుకొని మంగళవారం ఎన్టీపీసీ హరిహర దేవాలయం, హనుమాన్ దేవాలయంలోని వేద పండితులకు అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ ప్రతినిధి జనగామ తిరుపతి శ్రీముక్తేశ్వర సిద్ధాంతి రాసిన నూతన పంచాంగాన్ని మంగళవారం బహూకరించారు. ధర్మ ప్రచార సభ రాష్ట్ర సభ్యుడు జనగామ తిరుపతి ఆధ్వర్యంలో పీటీఎస్‌లోని వివిధ దేవాలయాల్లోని పూజారులు బ్రహ్మశ్రీ రాంపల్లి వామనశర్మ, రామాచార్యులు, పాపిట్ల రాజనరేంద్రస్వామి, రుద్రబట్ల శ్రీకాంత్ శర్మ, సురేశ్ శర్మ తదితరులకు పంచాంగం అందజేశారు. కొలాని వెంకటరెడ్డి, ఎన్టీపీసీ విశ్రాంత ఉద్యోగి సుదర్శన్‌బాబు, అయ్యప్ప దేవాలయం సభ్యుడు సంపత్‌రావు, తోట చిన్నయ్య, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఎన్టీపీసీ పీటీఎస్‌లోని పలు ఇళ్లలో చోరీలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి నగదు, బంగారు ఆభరణాలు అపహరించిన సంఘటన చోటు చేసుకుంది. పీటీఎస్‌లోని సీ–8/3 క్వార్టర్‌లో టీవీఆర్ చంద్ర నివసిస్తున్నాడు. 15న బంధువుల ఇంటికి వెళ్లి సోమవారం రాత్రి ఇంటికి వచ్చి చూసే సరికి తాళం పగులగొట్టి కనిపించింది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలోని బంగారు నగలు, కొంత నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఇదిలా ఉండగా సీ12/29 శ్రీనివాస్‌రావు ఇంట్లో అరకిలో వెండి, మరొకరి ఇంట్లో చోరీకి ప్రయత్నం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎన్టీపీసీ పోలీసులకు శ్రీనివాస్‌రావు మంగళవారం ఫిర్యాదు చేయగా ఎస్సై ఉదయ్‌కిరణ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

• విద్యుత్‌లైన్‌పై వాలి రామచిలుక మృతి..

రామగుండం: అంతర్గాం మండలంలోని ఐవోసీఎల్ ఫీడర్ విద్యుత్ లైన్‌పై మంగళవారం రామచిలుక వాలడంతో ఒక్కసారిగా మంటలు లేచాయి. ఆ మంటల్లో రామచిలుక కాలిపోగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్పందించిన విద్యుత్ సిబ్బంది సత్వరమే మరమ్మతు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

ముప్పిరితోటలో ఎల్లమ్మ బోనాలు



ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోటలో గౌడ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఎల్లమ్మ పట్నాలు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఎల్లమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం కుటుంబాల నుంచి ఇంటికో బోనం చొప్పున మహిళలు బోనాలతో ఆలయానికి తరలివెళ్లి మొక్కులు చెల్లించారు. బుధవారం ఎల్లమ్మ పట్నం, బోనాల చెల్లింపు, మొక్కుబడి కార్యక్రమాలు ఉంటాయని సంఘం అధ్యక్షుడు పూరెల్ల శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులు రంగు కొమురయ్య గౌడ్ తెలిపారు. మాజీ ఉపసర్పంచ్ చీకటి శైలజసంతోష్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఐదులీటర్ల నాటుసారా పట్టివేత

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ హనుమాన్ నగర్ ఏరియాలో మంగళవారం రామగుండం ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేశారు. ఎక్సైజ్ పోలీసుల వివరాల ప్రకారం హనుమాన్ నగర్‌కు చెందిన ఓ మహిళ ఇంట్లో నాటుసారా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు రామగుండం ఎక్సైజ్ శాఖ ఎస్సై తన సిబ్బందితో తనిఖీ చేశారు. సదరు మహిళ ఇంట్లో నిల్వ ఉన్న 5లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని ఆమెపై కేసు నమోదు చేసినట్లు రామగుండం ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఖదీర్, ప్రసాద్, కానిస్టేబుల్ రఘు, నరేశ్, రాజు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్, నిట్టూరు, నిమ్మనపల్లి, పాలితం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలతో పాటు రంగంపల్లి, చందపల్లి, బందంపల్లిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ రాజ్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.



జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీలో సైడ్ కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు రోడ్డు మధ్యలో పారుతోంది. దీంతో మురుగు నీరు నిలిచి దోమలకు ఆవాసంగా మారుతోంది. దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు సమస్యలు పరిష్కరించడంతో పాటు సైడ్ కాలువలను ఏర్పాటు చేసేందుకు నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

సింగరేణి సీఎండీ చొరవతో కారుణ్య నియామకాలు



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియాలో 29 మందికి కారుణ్య ఉద్యోగ నియామక ఉత్తర్వులను మంగళవారం జీఎం కార్యాలయంలో ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సీఅండ్‌ఎండీ ఎన్.బలరాం చొరవతో త్వరితగతిన కారుణ్య నియామక ఉత్తర్వులు అందించినట్లు తెలిపారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్నవారికి త్వరగానే డిపెండెంట్ కింద పోస్టింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా జాయిన్ అయ్యే ఉద్యోగులు కంపెనీ పురోభివృద్ధికి పాటుపడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, సీఎంవోఏఐ అధ్యక్షులు బి.మల్లేశ్, ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ ఆరెల్లి పోశం, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పీవోలు శ్రావణ్‌కుమార్, హనుమంతరావు, నాయకులు రంగు శ్రీను, సంతోష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మంథని: హైదరాబాద్‌లో న్యాయవాది ఇజ్రాయిల్‌ను దారుణంగా హత్య చేసిన సంఘటనపై నిరసన తెలుపుతూ మంథనిలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మూల స్వాతిగౌడ్‌కు న్యాయవాదులు వినతిపత్రం అందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిబాబు, ఉపాధ్యక్షుడు రఘోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సహేందర్‌రెడ్డి, కోశాధికారి ఆంజనేయులు, న్యాయవాదులు శశికాంత్ కాచే, రమేశ్ బాబు, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్, శశిభూషణ్ కాచే, జంజర్ల శేఖర్, ఆర్ల నాగరాజు, సుభాష్, శ్రీనివాస్, వెంకటరామ్ రెడ్డి, రాచర్ల రాజేందర్ ఉన్నారు.

మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

రామగుండం: అంతర్గాం మండల వ్యవసాయ కార్యాలయానికి 2024–25లో ఆర్‌కేవీవైలో భాగంగా మండలానికి సబ్సిడీ ద్వారా వ్యవసాయ పరికరాలు అందజేయడానికి మహిళా రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మండల వ్యవసాయాధికారి సతీశ్ తెలిపారు. ఇందులో బ్యాటరీ/చేతి పిచికారీ పంపులు–4, పవర్ స్ప్రేయర్స్–4, రోటోవేటర్–1, కల్టివేటర్/ఎంపీప్లౌ/కేజీవీల్స్/రోటోపడ్లర్/డిస్కహారో–1, బ్రష్ కట్టర్–1, ట్రాక్టర్–1 (నియోజకవర్గానికి) మొత్తం 12 పరికరాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. అర్హులైన మహిళా రైతులు దరఖాస్తుతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, పట్టాదారు పాసుపోర్టు సైజు ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్, ఆర్సీ బుక్ నకలు, కుటుంబసభ్యులకు చెందిన భూ వివరాలు, తహసీల్దార్ ధృవీకరణ నకలు పొందుపరిచి 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తు చేసుకోవాలి

ముత్తారం: ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల కోసం మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అనూష తెలిపారు. రాయితీ కింద చేతిపంపులు, బ్యాటరీ, స్ప్రేయర్, డిస్క్ హరో, కల్టివేటర్, ఎంబీప్లవ్, కేజీవీల్స్, రోటోప్లడర్, సీడ్ కం ఫెర్టిలైజర్ డ్రిల్, రోటోవేటర్, పవర్ వీడర్ అందుబాటులో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళా రైతులు మండల వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని బుగ్గ ఎక్స్‌రోడ్ నుంచి పొట్యాల, ముర్మూర్ వరకు ఉన్న డబుల్ రోడ్డుపై ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకుడు ఎండీ.గౌస్‌బాబా కోరారు. జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ డీఈఈ జాఫర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా కూడళ్లకు ముందు రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, కూడళ్ల వద్ద రోడ్డుపై తెలుపు రంగులో లైన్లు ఏర్పాటు చేయాలని, కూడళ్లకు ముందు రేడియం స్టిక్కర్‌తో వేగ నియంత్రణ చేసేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. త్వరితగతిన వాహనాల వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని విన్నవించారు. దీనిపై ఆర్‌అండ్‌బీ డీఈఈ సానుకూలంగా స్పందించినట్లు గౌస్‌బాబా పేర్కొన్నారు.

పాదయాత్రలో పాల్గొన్న ప్రతినిధికి సన్మానం



రామగుండం: గోదావరిఖని నుంచి ఎర్రవెల్లి వరకు 180 కిలోమీటర్ల గోదావరి కన్నీటి గోస పేరుతో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పాదయాత్ర చేసిన విషయం తెలిసిందే. పాదయాత్రలో పాల్గొన్న బీఆర్‌ఎస్ రామగుండం పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్‌ను మంగళవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కౌశిక హరి పాల్గొన్నారు.